సంపుటి :02 సంచిక :250 పేజీలు :04

వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శుక్రవారం 12, డిసెంబర్ 2025

- ఎల్లుండే రెండో విడత పంచాయతీ ఎన్నికలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 564 సర్పంచ్ స్థానాలు.. 4,928 వార్డు స్థానాలకు పోలింగ్
- గ్రామాల్లో ప్రలోభాలకు తెర తీసిన అభ్యర్థులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తుకు ఎత్తులు
- రిజర్వ్ స్థానాల్లో ఓటుకు రూ.500 వరకు, జనరల్ స్థానాల్లో రూ.2 వేల వరకు పంపిణీ
- ఇంటింటికీ మద్యం, చీరెలు, సొమ్ము అందజేత

04

# ముగిసిన ప్రచార హోరు





## కాంగ్రెస్‌లోనే

# టగ్ ఆఫ్ వార్!



### ఎమ్మెల్యే రేవూరి X మాజీ ఎమ్మెల్సీ కొండా

## గీసుకొండ మండలంలో ఆధిపత్యపోరు

- పంచాయతీ ఎన్నికల బరిలో రేవూరి, కొండా వర్గీయులు
- ఇప్పటికే గ్రామాల్లో రేవూరి ప్రచారం
- కొన్ని గ్రామాల్లో రెండు వర్గాల మధ్య ఢీ అంటే ఢీ..
- మండల కేంద్రంలో ఆసక్తి రేపుతున్న ముఖ్య నేతల పోటీ
- హీటెక్కిస్తున్న రెండో విడత పంచాయతీ ఎన్నికలు

వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో జరగనున్న రెండో విడత పంచాయతీ ఎన్నికలు కేవలం అధికార పీఠాల పోరుగానే కాకుండా, పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్ర నాయకుల మధ్య ఆధిపత్య పోరుకు వేదికగా మారినట్లు కనబడుతుంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధరరావు వర్గాల మధ్య నెలకొన్న అంతర్గత వైరం ఈ పంచాయతీ సమరంలో మరోసారి తెరపైకి వచ్చింది. వాస్తవానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఇద్దరూ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారైనప్పటికీ, క్షేత్ర స్థాయిలో ఈ రెండు వర్గాల మధ్య రాజకీయ వైరం కొనసాగుతున్నట్లు స్పష్టం అవుతుంది. దీంతో పరకాల నియోజకవర్గంలోని గీసుకొండ మండలంలో ఈ పంచాయతీ ఎన్నికల రాజకీయాలు ఆసక్తి రేపుతున్నాయి.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02

# కాయ్ రాజా కాయ్

## నాగారంలో సర్పంచ్ స్థానంపై ఎన్నికల బెట్టింగ్



పరకాల మండలం నాగారం గ్రామం పంచాయతీలో ఎన్నికల వేళ బెట్టింగ్ జోరందుకుంది. ఇక్కడ సర్పంచ్ పదవికి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొంది. దీంతో గ్రామంలోనే కాకుండా జిల్లాస్థాయిలో కూడా భారీగా పందేల వ్యవహారాలు జరుగుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని నాగారం గ్రామపంచాయతీలో సర్పంచ్, వార్డుల స్థానాలకు రెండో విడత ఈనెల 14న పోలింగ్ జరగనుంది.

– అక్షరదర్బార్, పరకాల

02

# ఓటేశామని ప్రమాణం చేసి చెప్పండి



- లేదంటే ఇచ్చిన తాయిలం తిరిగి ఇవ్వండి
- సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిన వారి డిమాండ్
- సోమ్లాతండా, బండవుతాపురంలో ఘటనలు

04

ఓట్లు వేస్తామంటే మీకు డబ్బులిచ్చాం.. డబ్బులు తీసుకునికూడా మీరు మాకు ఓట్లు వేయలేదు.. అందుకే మేం ఓడిపోయాం.. మా డబ్బులు మాకు తిరిగి ఇవ్వండి.. ఓట్లు వేసినట్లయితే మీకే ఓట్లు వేశామని ప్రమాణం చేయండి.. అంటూ మహబూబాబాద్ జిల్లా సోమ్లాతండా, వరంగల్ జిల్లా బండవుతాపురం గ్రామాల నుంచి సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేసి ఓడిపోయిన వారు నిలదీయడం చర్చనీయాంశమైంది.

–అక్షరదర్బార్, వరంగల్

అక్షర దర్బార్ Voice of the people




# కాంగ్రెస్‌లోనే టగ్ ఆఫ్ వార్ !

- ఎమ్మెల్యే రేవూరి X మాజీ ఎమ్మెల్సీ కొండా
- గీసుకొండ మండలంలో ఆధిపత్యపోరు
- పంచాయతీ ఎన్నికల బరిలో రేవూరి, కొండా వర్గీయులు
- ఇప్పటికే గ్రామాల్లో రేవూరి ప్రచారం
- కొన్ని గ్రామాల్లో రెండు వర్గాల మధ్య ఢీ అంటే ఢీ..
- మండల కేంద్రంలో ఆసక్తి రేపుతున్న ముఖ్య నేతల పోటీ
- హీటెక్కిస్తున్న రెండో విడత పంచాయతీ ఎన్నికలు



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో జరగనున్న రెండో విడత పంచాయతీ ఎన్నికలు కేవలం అధికార పీఠాల పోరుగానే కాకుండా, పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్ర నాయకుల మధ్య ఆధిపత్య పోరుకు వేదికగా మారినట్లు కనబడుతుంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ ధరరావు వర్గాల మధ్య నెల కొన్న అంతర్గత వైరం ఈ పంచాయతీ సమరంలో మరోసారి తెరపైకి వచ్చింది. వాస్తవానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఇద్దరూ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారైనప్పటికీ, క్షేత్ర స్థాయిలో ఈ రెండు వర్గాల మధ్య రాజకీయ వైరం కొనసాగుతున్నట్లు స్పష్టం అవుతుంది. దీంతో పరకాల నియోజకవర్గంలోని గీసుకొండ మండలంలో ఈ పంచాయతీ ఎన్నికల రాజకీయాలు ఆసక్తి రేపుతున్నాయి.

### - పోటా పోటీ

మండల కేంద్రమైన గీసుకొండ పంచాయతీలో రెండు వర్గాల మధ్య పోరు పతాక స్థాయికి చేరింది. ఈ మండలంలో కాంగ్రెస్ పార్టీలో పెద్దనేతల్లో కొమురారెడ్డి, రాజ్ కుమార్ ఉంటారు. వీరిలో కొమురారెడ్డికి ఎమ్మెల్యే రేవూరి మద్దతుదారుడిగా పేరుంది. అలాగే రాజ్ కుమార్ కు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు అనుచరుడిగా పేరింది. గీసుకొండ గ్రామ పంచాయతీ ఈసారి జనరల్‌కు రిజర్వ్ కావడంతో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి చెందిన కొమురారెడ్డి, రాజ్‌కుమార్ ఎన్నికల బరిలో దిగారు. ఒకే పార్టీ నుంచి సర్పంచ్ అభ్యర్థులుగా వీరిద్దరు పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఇప్పటికే స్వయంగా కొమురారెడ్డికి మద్దతుగా గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీంతో ఎమ్మెల్యే ఈ పోటీని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారో అర్థమవుతున్నది. ఒకే పార్టీ నుంచి ఇద్దరు ముఖ్య నాయకులు ఒకే స్థానం కోసం తలపడటం, వారి వెనుక అగ్ర నాయకుల అండదండలు ఉండటం ఈ ఎన్నికల రసవత్తర వాతావరణానికి నిదర్శనం.

### - మరికొన్ని గ్రామాల్లో బలాబలాలు.. మద్దతులు ఇలా..

మండలంలోని కీలక పంచాయతీల్లో కొండా వర్గీయులు పోటీలో ఉన్న చోట వారికి బీఆర్ఎస్ మద్దతు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా, మరికొన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు కొండా వర్గీయులు మద్దతు ప్రకటించినట్లు ప్రచారం జరుగుతుండటం గమనార్హం. దీనికి భిన్నంగా, ఓ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సమీకరణాలు ఏక పార్టీ రాజకీయాలకు అతీతంగా, కేవలం వ్యక్తిగత ఆధిపత్యం చుట్టూ తిరుగుతున్నాయని అర్థమవుతోంది. గీసుకొండతో పాటు మరో నాలుగు గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు కాంగ్రెస్ వర్సెస్ కొండా వర్గాల మధ్య ప్రధాన పోటీ నెలకొనగా ఈ గ్రామాల్లో కొండా వర్గీయులైన సర్పంచ్ అభ్యర్థులకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తున్నట్లు ప్రచారంలో ఉంది. అలాగే ఇంకొన్ని గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మద్దతుదారుల మధ్య పోరు నడుస్తుండగగా బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులకు కొండా వర్గం మద్దతు ఉన్నట్లు ప్రచారంలో ఉంది. మొత్తానికి పంచాయతీ ఎన్నికలు పరకాల నియోజకవర్గంలోని వివిధ గ్రామపంచాయతీల్లో హాట్ టాపిక్ గా మారాయి. ముఖ్యంగా సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి రెండు వర్గాలకు చెందిన అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొన్న గ్రామాల్లో ఫలితాలపై ఉత్కంఠ చోటు చేసుకుంది.

## గ్రామాల్లో ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రచారం..

### కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం



అక్షర దర్బార్, భూపాలపల్లి :సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) రామ్నాయక్ తండా, కొంపల్లి, గుడాడ్ పల్లి, గొర్లవేడు గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, స్థానిక నేతలతో కలిసి జరిగిన ఈ ప్రచారంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. పబ్లిక్ కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడిన ఎమ్మెల్యే, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండేళ్లలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు అయ్యాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని నేతలు, కార్యకర్తలు ఏకతాటిపై పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## బాధితుడికి మొబైల్ ఫోన్ అప్పగింత

అక్షర దర్బార్, చిట్యాల : పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను కేవలం కొన్ని గంటల్లోనే గుర్తించి బాధితుడికి తిరిగి అప్పగించిన చిట్యాల పోలీసులు ప్రశంసలు అందుకున్నారు. చిట్యాల మండల కేంద్రానికి చెందిన గాజె రవీందర్ తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే కానిస్టేబుల్ లాల్‌సింగ్ మొబైల్ వివరాలను CEIR పోర్టల్‌లో నమోదు చేసి ట్రేసింగ్ ప్రారంభించారు. సుమారు ఆరు గంటల్లోనే మొబైల్‌ను గుర్తించగా, చిట్యాల రెండో ఎస్ఐ హేమలత మొబైల్‌ను బాధితుడు రవీందర్‌కు అధికారికంగా అందజేశారు.

## కాయ్ రాజా కాయ్

### - నాగారంలో సర్పంచ్ స్థానంపై ఎన్నికల బెట్టింగ్

అక్షరదర్బార్, పరకాల: పరకాల మండలం నాగారం గ్రామం పంచాయతీలో ఎన్నికల వేళ బెట్టింగ్ జోరందుకుంది. ఇక్కడ సర్పంచ్ పదవికి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొంది. దీంతో గ్రామంలోనే కాకుండా జిల్లాస్థాయిలో కూడా భారీగా పందేల వ్యవహారాలు జరుగుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని నాగారం గ్రామపంచాయతీలో సర్పంచ్, వార్డుల స్థానాలకు రెండో విడత ఈనెల 14న పోలింగ్ జరగనుంది. అభ్యర్థుల బలాబలాలు, ఓటర్ల సమీకరణలు, యువత తీరుతెన్నులు... అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని రెండు పార్టీల నేతలు చివరి వరకూ శక్తి పరీక్షకు దిగడంతో బెట్టింగ్ సిండికేట్‌లు రంగంలోకి దిగినట్టు స్థానికులు చెబుతున్నారు. గ్రామం, మండల స్థాయిలో మొదలైన ఈ పందెలు ఇప్పుడు జిల్లాస్థాయికి చేరుకున్నాయని, దీనిపై ఇంటెలిజెన్స్ శాఖ కూడా లోతుగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఎన్నికల వేళ ఇలా బెట్టింగ్ వ్యవహారాలు పెరగడంపై సాధారణ ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 71 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు

### - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

అక్షరదర్బార్, జనగామ: జిల్లాలో గురువారం జరిగిన మొదటి విడత పంచాయతీ ఎన్నికల విధులకు గైర్హాజరైన 71 మంది అంగన్వాడీ, ఎస్జీటీ, ఇతర ఉపాధ్యాయులు, అధికారులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా.. మొదటి విడత ఎన్నికల విధులకు 71 మంది అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం అందించకుండా గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల విధులు చాలా కీలకమని, వీటికి హాజరు కాని 71 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, వీరిపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవద్దో వెంటనే సమాధానం ఇస్తూ... రెండవ విడత ఎన్నికల విధులను కేటాయించిన సంబంధిత ఎంపీడీఓ దగ్గరికి రేపు వెళ్లి రిపోర్ట్ చేయడంతో పాటు.. సంజాయిషీ రిపోర్ట్ ని ఎంపీడీఓ ద్వారా తమకి పంపించాలని ఆదేశించారు.

## డాగ్ స్క్వాడ్ యూనిట్ తనిఖీ చేసిన ఎస్పీ



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలోని( ఎంటి) (పార్క్ )విభాగం మరియు డాగ్ స్క్వాడ్ యూనిట్ పై జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా వాహనాల రికార్డులు, రోజువారీ మెయింటెనెన్స్ రిజిస్టర్, ఫ్యూయల్ వినియోగ వివరాలు, వాహనాల స్థితిగతుల పై ఎస్పీ . సమగ్రంగా పరిశీలించారు. బందోబస్తు బాధ్యతల్లో వాహనాలు ఎలాంటి సమస్యలు లేకుండా పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డాగ్ స్క్వాడ్ విషయంలో కేనైన్‌ల ఆరోగ్య పరిస్థితి, ట్రైనింగ్ రికార్డులు, స్పందన సామర్థ్యం, విభాగం పనితీరు, పరికరాల లభ్యతను పరిశీలించి యూనిట్‌ను మరింత బలోపేతం చేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# దుర్గం రమణయ్యపై దాడిని ఖండిస్తున్నాం

**రాష్ట్ర దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు కోగిల మహేష్**



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం అధికార పార్టీ నాయకులు టీఆర్ఎస్ జిల్లా నాయకుడిగా, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన దుర్గం రమణయ్యపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర దళిత బంధు సాధన సమితి అధ్యక్షుడు కోగిల మహేష్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక రమణయ్యపై భౌతిక దాడి చేయడం తీవ్ర అనైతిక చర్య అని కోగిల మహేష్ విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజయంలో రమణయ్య కీలక పాత్ర పోషించడంతో కోపంతో అధికారులు రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక ఈ దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. దళితుడైన రమణయ్యపై దాడి జరగడం దుర్మార్గమని, ఈ దాడి వెనుక ఉన్నవారిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇలాంటి దాడులు పునరావృతమైతే బీఆర్ఎస్ నాయకత్వం నిశ్శబ్దంగా ఉండదని హెచ్చరించారు. తక్షణమే నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ పార్టీతో పాటు దళిత సంఘాల ఆధ్వర్యంలో తాడువాయి ముట్టడికి పిలుపునిస్తామని కోగిల మహేష్ స్పష్టం చేశారు.

# కాసులపహాడ్ సర్పంచ్ అయిలయ్యకు సన్మానం



అక్షర దర్బ ,మొగుళ్లపల్లి : మొగుళ్లపల్లి మండలంలోని కాసులపహాడ్ గ్రామ నూతన సర్పంచ్‌గా కుర్మ అయిలయ్య సగర ఎన్నికయ్యారు. కాగా తెలంగాణ రాష్ట్ర సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నలుబాల భిక్షపతి సగర, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట రాజు సగర, గ్రామ సగర కులస్తును అయిలయ్యను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయిలయ్య సగర మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితో పాటు కుల సంఘం అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు.




# అభివృద్ధి నిరోధకుడు ఎమ్మెల్యే దొంతి

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**

బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గ్రామాల్లో ర్యాలీ

అక్షర దర్బార్ నల్లబెల్లి : నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి అభివృద్ధి నిరోధకుడిగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో తెచ్చిన కోట్ల రూపాయల నిధుల పనులకు బిల్లులు ఆపివేయడం, శంకుస్థాపన చేసిన రోడ్ల పనులు, టెండర్లు పూర్తయినా కూడా రద్దు చేయిస్తున్నాడని మండిపడ్డారు. శుక్రవారం నల్లబెల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ బలపరిచిన గ్రామపంచాయతీ అభ్యర్థి నాగెల్లి జ్యోతిప్రకాశ్‌కు ఉంగరం గుర్తుకు మద్దతు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని, యూరియా కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి కాంగ్రెస్ పాలనలోనే ఏర్పడిందని విమర్శించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాధవరెడ్డి నర్సంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పుడు గ్రామపంచాయతీ ఎన్నికల్లో తిరుగుతూ ఓట్లు ఎలా అడుగుతున్నారని ప్రశ్నించిన ఆయన, నిజంగా ప్రజాప్రతినిధిగా ధైర్యం ఉంటే రైతులకు యూరియాను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెద్ది స్వప్న, మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, చెట్టు పెల్లి మురళీధర్, మాజీ ఎంపీటీసీలు జయరావు, వైనాల వీరస్వామి, సర్పంచులు కోమల రాజారాం, కోటిలింగాచారి, గుండాల కుమార్ స్వామి, సట్ల శ్రీనివాసు, నాగవెల్లి శ్రీనివాస్, పుడేటి ప్రకాశం పాల్గొన్నారు.

# 21న జాతీయ మెగా లోక్ అదాలత్

- **రాజీతో సమస్యను పరిష్కరించుకోండి**
- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



అక్షరదర్బార్, హనుమకొండ: ఈ నెల 21న జాతీయ మెగా లోక్ అదాలత్ జరగనుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. ఈ జాతీయ మెగా లోక్ ఆదాలత్ సంబంధించి వరంగల్ కమిషనరేట్ పోలీసులు రూపొందించిన వాల్ పోస్టర్లను ఆయన శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆదివారం రోజున జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసుల్లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏసీపీ శుభం, ఏసీపీ దేవిడ్ రాజు, ఇన్ స్పెక్టర్లు రమేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



అక్షర దర్బార్, పరకాల: సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజలను కోరారు..శుక్రవారం కామారెడ్డిపల్లి, వెల్లంపల్లి, పోచారం, అలియాబాద్ గ్రామాలలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో వారు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల వారిగా నియమించిన ఇంచార్జులు అప్రమత్తంగా ఉండాలని,ప్రతి ఓటరుని కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను వివరించాలని అన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ చేసిన అభివృద్ధికి ప్రజలకు గుర్తుచేయాలి.గత రెండేళ్లలో రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సాధారణ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడ అమలుచేయని కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లకోసం వస్తె నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బోగస్ హామీలతో అధికారంలోకి వచ్చి అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఓటమి భయంతో సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు ఓటువేయకుంటే సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు ఆపేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు.వారి బెదిరింపులకు భయపడాల్సిన అవసరంలేదని ప్రజలకు అండగా ఎల్లప్పుడూ బిఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్దిచెప్పాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల,గ్రామ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ బరిలో రైతు బిడ్డ ఎల్లస్వామి

- **ధర్మారం గ్రామ అభివృద్ధే లక్ష్యం**
- **పూర్తి మద్దతిస్తున్న ప్రజలు**



అక్షరదర్బార్, పరకాల: ధర్మారం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న భాషిక ఎల్లా స్వామి ప్రజల ఆశీర్వాదాలతో విజయం వైపు దూసుకెళ్తున్నారని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఉన్నత విద్యావంతుడైన ఎల్లా స్వామి గ్రామ సమస్యలపై పూర్తి అవగాహనతో ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాలు పంచుకుంటున్న నాయకుడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎల్లా స్వామి మాట్లాడుతూ ఈ నెల 17న జరిగే ఎన్నికల్లో ఉంగరం గు ర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రామంలో మహిళల గౌర వం కోసం బతుకమ్మ వేదిక, రైతులకు పంట పోయే దారుల అభి వృద్ధి, చెరువుల తూములు–కట్టల మరమ్మతులు, కులసంఘాల కమిటీ భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతు బిడ్డగా రైతుల సమస్యలు బాగా తెలిసిన నేపథ్యంలో ప్రతి రైతు కు అవసరమైన సదుపాయాలు చేరేలా కృషి చేస్తానని తెలిపారు. అలా గే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి చేరేలా చూస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం అందరూ ఉంగరం గుర్తుకు ఓ టు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎల్లా స్వామి కోరారు.

# పరకాలకు అన్యాయం చేస్తే ఊరుకోం..

**బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్**



అక్షరదర్బార్, పరకాల: డి-లిమిటేషన్ పేరుతో పరకాల నియోజకవర్గాన్ని మార్చే కుట్ర జరుగుతుందని పరకాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు గాజుల నిరంజన్ మండిపడ్డారు. ఉద్యమకారులు పురిటిగడ్డ, నిజాం రజాకార్లతో పోరాడి ప్రాణాలర్పించిన పరకాలను గత బీఆర్ఎస్ పాలనలోనే జిల్లా ఏర్పాటు విషయంలో అన్యాయం జరిగిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి చెందినవారు కానందున, జిల్లా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి ఆత్మకూరును నియోజకవర్గ కేంద్రంగా మారుస్తానని చెప్పడం నాయకుల ముందస్తు ప్రణాళిక ప్రకారం పరకాలను చరిత్రపుటలనుంచి తొలగించేలా ఆత్మకూరు నియోజకవర్గం ఏర్పాటు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని నిరంజన్ ఆరోపించారు. పరకాల నియోజకవర్గాన్ని మార్చే ప్రయత్నం చేస్తే బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. గ్రామపంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరకాల ప్రజలు తగిన బుద్ధి చెబుతారని నిరంజన్ పిలుపునిచ్చారు.

# వెంకటేశ్వర్లపల్లి ప్రజలకు కృతజ్ఞతలు

### ప్రజల నమ్మకాన్ని నిలబెడతాను
### : సర్పంచ్ మహేందర్ రెడ్డి



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం వెంకటేశ్వర్ల పల్లి సర్పంచ్‌గా బిఆర్ఎస్ మద్దతుతో గెలుపొందిన పెండ్యాల మహేందర్ రెడ్డి గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన విజయానికి తోడ్పడ్డ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు మరియు గ్రామ ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.గ్రామ అభివృద్ధే లక్ష్యమని, పార్టీలకతీతంగా అందరినీ కలుపుకొని పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. గ్రామ సమస్యలను వేగంగా పరిష్కరించి, వెంకటేశ్వర్లపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తానని మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు.

# చిట్యాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం

### సర్పంచ్ అభ్యర్థి తౌటం లక్ష్మి



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల గ్రామాభివృద్ధే ధ్యేయంగా తాను సర్పంచ్ బరిలోకి దిగుతున్నానని సర్పంచ్ అభ్యర్థి తౌటం లక్ష్మి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చిట్యాల సామాజిక ఆసుపత్రిలో వైద్యం ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో మంచినీటి సౌకర్యాలను పూర్తిగా మెరుగుపరచడం, రామాలయం నిర్మాణాన్ని పూర్తి చేయడం తమ ప్రధాన ప్రాధాన్యతగా పేర్కొన్నారు. భారీ మెజారిటీతో తనను గెలిపించి చిట్యాల అభివృద్ధికి అవకాశం కల్పించాలని తౌటం లక్ష్మి కోరారు.

# నడికూడ మండలంలో కాంగ్రెస్ శ్రేణుల దూకుడు

### సర్పంచ్ అభ్యర్థుల గెలుపునకు ఎమ్మెల్యే రేవూరి ప్రచారం

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రచార వేగాన్ని మరింత పెంచాయి. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వరుసగా పలు గ్రామాల్లో పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కౌకొండ గ్రామంలో మోర్తాల కళ్యాణి రాజు, ముస్తాలపల్లిలో కసుబోజుల వేణు చారి, చర్లపల్లిలో రావుల పద్మ, నార్లాపూర్‌లో పెద్దబోయిన రవీందర్‌కు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓటర్లను సంప్రదించారు.వరికోల్ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి మంద రజిత శరత్‌కుమార్ గెలుపు కోసం పార్టీ రాష్ట్ర



ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్యతో కలిసి రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రచారం నిర్వహించారు.స్థానిక అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని రేవూరి పిలుపునిచ్చారు.



# ఓటేశామని ప్రమాణం చేసి చెప్పండి

- లేదంటే ఇచ్చిన తాయిలం తిరిగి ఇవ్వండి
- సర్పంచ్ గా పోటీ చేసి ఓడిన వారి డిమాండ్
- సోమ్లాతండా, బండవుతాపురంలో ఘటనలు

అక్షరదర్బార్, వరంగల్ : ఓట్లు వేస్తామంటే మీకు డబ్బులిచ్చాం.. డబ్బులు తీసుకునికూడా మీరు మాకు ఓట్లు వేయలేదు.. అందుకే మేం ఓడిపోయాం.. మా డబ్బులు మాకు తిరిగి ఇవ్వండి.. ఓట్లు వేసినట్లయితే మీకే ఓట్లు వేశామని ప్రమాణం చేయండి.. అంటూ మహబూబాబాద్ జిల్లా సోమ్లాతండా, వరంగల్ జిల్లా బండవుతాపురం గ్రామాల నుంచి సర్పంచ్ అభ్యర్థులు ◌ంగా పోటీ చేసి ఓడిపోయిన వారు నిలదీయడం చర్చనీయాంశమైంది.

### - సోమ్లాతండాలో

సోమ్లా తండాలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ సోదరుడి భార్య భూక్య కౌసల్య సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేశారు. గురువారం జరిగిన



ఎన్నికల్లో ఆమె పరాజయం పాలయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం తాను ఓట్ల కోసం ఓటర్లకు ఒక్కొక్కరికీ చెల్లించిన రూ.1,500 తిరిగి వసూలు చేసుకోవడానికి ఆమె, భర్త కొడుకు రంగంలోకి దిగి ఇంటింటికి తిరుగుతూ మీరు నాకు ఓట్లు వేయలేదు.. అందుకే ఓడిపోయాను.. ఓటేసినట్లు ఊరికే చెబితే నమ్మేది లేదు దేవుడి జెండాపై ప్రమాణం చేయాలంటూ తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు తండావాసులు ఆందోళనకు దిగారు. మిమ్మల్ని డబ్బులు ఎవ్వరూ ఇవ్వమని అడిగారు.. మీరే మా కాళ్లు పట్టుకొని బతిమిలాడి ఓటుకు రూ.1500ల చొప్పున ఇచ్చి ఇప్పుడు ఓడిపోతే దౌర్జన్యానికి దిగి ఇచ్చిన డబ్బులు తిరిగి తీసుకోవడానికి మాతో ఓట్లు వేయిస్తారా అంటూ తండావాసులు నిరసనకు దిగారు. దీనితో తండాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తండావాసులు తమపై దౌర్జన్యం చేస్తున్నారని వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ విషయం ఆ నోట ఈ నోట పోలీసులకు తెలియడంతో పోలీసులు తండాకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

### - బండవుతాపురంలో

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని బండవుతాపురంలోనూ అలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఓ అభ్యర్థి ఓటుకు వెయ్యి రూపాయలు చొప్పున 550 మందికి గురువారం ఎన్నికల సమయం సందర్భంగా ఇవ్వగా, ఎన్నికల ఫలితాల్లో ఆయనకు 50 ఓట్లు మాత్రమే రావడంతో, కంగుతున్న ఆ అభ్యర్థి డబ్బులు తీసుకున్న వారు తనకు ఓట్లు వేయలేదని, మీరు ఓట్లు వేస్తే గెలిచే వాడినే అంటూ శుక్రవారం తానిచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలంటూ గ్రామంలో ఇల్లు తిరిగాడు. ఈ సంఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందర్భంగా భారీగా నగదు పంపిణీ జరిగిందన్నడానికి ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

# ముగిసిన ప్రచార హోరు

- ఎల్లుండే రెండో విడత పంచాయతీ ఎన్నికలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 564 సర్పంచ్ స్థానాలు.. 4,928 వార్డు స్థానాలకు పోలింగ్
- గ్రామాల్లో ప్రలోభాలకు తెర తీసిన అభ్యర్థులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తుకు ఎత్తులు
- రిజర్వ్ స్థానాల్లో ఓటుకు రూ.500 వరకు, జనరల్ స్థానాల్లో రూ.2 వేల వరకు పంపిణీ

\- ఇంటింటికీ మద్యం, చీరెలు, సొమ్ము అందజేత



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి
ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. మైక్ సెట్‌లు, నేతల నినాదాలు, ప్రచార డప్పులు, మూగబోయాయి. అభ్యర్థులు, కార్యకర్తలు ఇక ప్రలోభాలకు తెర తీశారు. అభ్యర్థులు ఆఖరు రోజు పోటాపోటీగా ప్రచారం చేశారు. పార్టీల మద్దతుతో బరిలో ఉన్న వారు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను గ్రామాలకు పిలిపించి ఓట్లు అభ్యర్థించారు. 'గుర్తులు.. గుర్తుంచుకో' అంటూ వీధి వీధి తిరిగి ఊదరగొట్టిన మైక్‌లు మూగబోయాయి. కార్నర్ మీటింగులు, సభలు, సమావేశాలు ఆగిపోయాయి. రెండో విడతలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 564 సర్పంచ్ స్థానాలు, 4,928 వార్డు స్థానాలకు పోలింగ్ జరుగనుంది. ఈ నెల 14న రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో రేపు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో ఎన్నికల సిబ్బంది తరలివెళ్లనున్నారు. ఎల్లుండి ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్ ప్రారంభమై, అనంతరం ఫలితాలు ప్రకటించనున్నారు.

### - ప్రలోభాల పర్వం

మొదటి పంచాయతీ ఎన్నికల కంటే ఈవిడతకు పోటీ చేసే అభ్యర్థులు మరింత ఎక్కువ డబ్బు పంపిణీ చేసే అవకాశం కనిపిస్తున్నది. బంధువులు, సన్నిహితులను రంగంలోకి దించి అభ్యర్థులు ఇంటింటికీ మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నారు. కొన్నిచోట్ల ఇంటింటికి అభ్యర్థుల కొందరు చికెన్ పంపుతున్నారు. మరికొన్నిచోట్ల మహిళలకు చీరెల పంపిణీ కూడా చేస్తున్నారు. అధికార పార్టీ హవా ఉన్న చోట్ల ఆ అభ్యర్థులు తమ ప్రత్యర్థి ఇచ్చే పోటీని బట్టి పంపిణీని జరిపే ప్రయత్నాలు చేస్తున్నారు. జనరల్ స్థానాల్లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు, రిజర్వేషన్ స్థానాల్లో రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు పంపిణీ చేసే పనిలో ఉన్నారు.

### - రెండో విడత ఎక్కడంటే

తొలి విడత పంచాయతీ ఎన్నికలు గురువారం ముగిశాయి. రెండో విడత పంచాయతీ ఎన్నికలు హనుమకొండ జిల్లాలో పరకాల, హసన్ పర్తి, ధర్మసాగర్, వేలేరు, ఐనవోలు మండలాల్లోని గ్రామపంచాయతీల్లో, వరంగల్ జిల్లాలో సంగెం, గీసుకొండ, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లోని గ్రామపంచాయతీలు, భూపాలపల్లి జిల్లాలో చిట్యాల, టేకుమట్ల, భూపాలపల్లి, పలిమెల మండలాల్లోని గ్రామపంచాయతీలు, ములుగు జిల్లాలో వెంకటాపూర్, ములుగు, మల్లంపల్లి మండలాలు, జనగామ జిల్లాలో తరిగొప్పుల, నర్మెట్ట, జనగామ, బచ్చన్నపేట, మండలాల్లోని గ్రామపంచాయతీల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఈనెల 14న పోలింగ్ జరగనుంది. పోలింగ్, కౌంటింగ్ నిర్వహణ కోసం ఇప్పటికే అధికారులు, సిబ్బంది శిక్షణ పొందారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915